క్లుప్తంగా

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



కార్యక్రమంలో మాట్లాడుతున్న పోషకాహార నిపుణురాలు పూజిత

గాజువాక: మంచి జీవన శైలితోపాటు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని పోషకాహార నిపుణురాలు డి.పూజిత పేర్కొన్నారు. విద్యార్థులకు, తల్లిదండ్రులకు పౌష్టికాహారం ఆవశ్యకతపై స్థానిక భాస్కర్ విద్యానికేతన్‌లో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రముఖ ఐటీ కంపెనీ సింబయోసిస్, యంగ్ ఇండియన్స్ ఎన్‌జీవో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ పిల్లలు ఆరోగ్యవంతులుగా ఎదగడానికి దోహదపడే ఆహారాలను, అలవాట్లను వివరించారు. వ్యాధి నిరోధకశక్తిని పెంచుకొనే మార్గాలను చెప్పారు. పండ్లు, ఆకు కూరలు, చిరుధాన్యాలు, డ్రైఫ్రూట్స్, పాలు, పెరుగు, గుడ్లు తదితర ఆహార పదార్థాలను తీసుకోవడంద్వారా లభించే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ పి.భాస్కరరావు, కరస్పాండెంట్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు క్యాంటీన్లు నేలమట్టం



నేలమట్టం చేసిన ప్రైవేటు క్యాంటీన్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లోని ప్రైవేటు క్యాంటీన్లను బుధవారం నేలమట్టం చేశారు. ప్రైవేటు క్యాంటీన్లను నిలిపి వేయాలని యాజమాన్యం గత నెలలో నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా 70 ప్రైవేటు క్యాంటీన్లు, పాన్ షాపులు, జ్యూస్ షాపులకు నోటీసులు జారీ చేశారు. వారంలోగా ఆ షాపులను మూయించేశారు. అయితే అప్పటి నుంచి ఆయా క్యాంటీన్ల బిల్డింగ్‌లు అలా ఉండి పోయాయి. దీంతో యాజమాన్యం ఇచ్చిన ఆదేశాలతో లోడర్లతో ప్రైవేటు క్యాంటీన్లను నేలమట్టం చేశారు. కొన్ని క్యాంటీన్లకు మరలా అనుమతిస్తారని ఆశతో ఉన్న షాపుల యాజమానులకు ఈ నిర్ణయం నిరాశను మిగిల్చింది.

రాధాకృష్ణన్ విజయంపై సంబరాలు



మిఠాయిలు తినిపించుకుంటున్న బీజేపీ నాయకులు

గాజువాక: భారత ఉపరాష్ట్రపతిగా సి.పి. రాధాకృష్ణన్ విజయం సాధించడంపై బీజేపీ నాయకులు గాజువాకలో సంబరాలు చేసుకున్నారు. ఆ పార్టీ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు ఆధ్వర్యంలో స్థానిక వందడుగుల రోడ్ జంక్షన్‌లో టపాసులు కాల్చి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు మాట్లాడుతూ వికసిత్ భారత్ లక్ష్యంగా ప్రధానమంత్రి మోదీ పాలన సాగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో గాజువాక సమన్వయకర్త దీనంకొండ కృష్ణంరాజు, నాయకులు సిరసపల్లి నూకరాజు, లక్కరాజు సోంబాబు, పాలిమేర శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'హోల్డ్ ఆన్' పుస్తకావిష్కరణ



రచయిత పూజితను సత్కరించి జ్ఞాపిక అందిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో బుధవారం ఆత్మహత్యల నివారణకు సంబంధించిన పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ పూజిత జోస్యుల 'హోల్డ్ ఆన్' అనే శీర్షికతో రచించిన సూసైడ్ ప్రివెన్షన్ అవుట్ రీచ్ – లైఫ్ సేవర్ అనే పుస్తకాన్ని ముఖ్య అతిథి నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల్లో ఆత్మహత్యలు నివారించడానికి మానసిక శాస్త్రంపై అవగాహన ఉండాలన్నారు. అనంతరం పుస్తక రచయిత పూజితను సత్కరించి జ్ఞాపిక అందజేశారు. పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రత్నకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బి.మురళీధరరావు, కాలేజీ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నా కార్డు ఎక్కడ?

- పండుటాకులకు అందని రేషన్ కార్డులు
- వృద్ధులకు ఇళ్లవద్దే కార్డులు అందజేయాలన్న ఆదేశాలు బేఖాతరు
- రేషన్ డిపోల చుట్టూ ప్రదక్షిణలు



రేషన్ కార్డుల కోసం డిపో వద్ద క్యూలు





గాజువాక: గాజువాక జోన్‌లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ గందరగోళంగానే సాగుతోంది. నిన్న మొన్నటివరకు సచివాలయాల్లో సాగిన రైస్ కార్డుల పంపిణీ ఇప్పుడు రేషన్ డిపోలకు చేరింది. అయితే ఒక రేషన్ డిపో పరిధిలో ఉన్న కార్డులు ఇప్పుడు వేరే డిపో పరిధిలోకి మారిపోయాయి. దీంతో ఎవరి కార్డు ఎక్కడ ఉందో తెలుసుకోవడానికే కార్డుదారులు అవస్థలు పడాల్సి వస్తోంది. ఫలితంగా ఇంకా 30వేల కార్డులు పంపిణీకి నోచుకోలేదు.

నిబంధనలు బేఖాతరు

ఇదిలా ఉండగా, 65 ఏళ్లు దాటిన కార్డుదారులకు సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి కార్డులు అందజేయాల్సి ఉంది. అయితే, ఇప్పటివరకు ఎక్కడా ఒక్క కార్డు కూడా వారు అందజేయలేదు. వృద్ధులు ఓపిక చేసుకొని రేషన్ డిపోలకు వెళ్తున్నారు. గంటల తరబడి క్యూ లైన్‌లో నిలబడి తమ రైస్ కార్డులను తీసుకొంటున్నారు. డిపోలకు వెళ్లలేనివారికి మాత్రం ఇంకా రేషన్ కార్డులు అందలేదు. మరోపక్క రేషన్ కార్డులు కూడా ఒక దుకాణం నుంచి మరో దుకాణానికి మారిపోవడంతో ఎక్కడికి వెళ్లి కార్డు తెచ్చుకోవాలో తెలియని పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. ఎప్పటిలాగే తాము వెళ్లి రేషన్ తెచ్చుకొనే దుకాణానికి వెళ్తున్న వృద్ధులకు వారి కార్డు అక్కడ లేదనే సమాధానం వినిపిస్తోంది. ఈ పరిస్థితుల్లో అధికారులు కలుగజేసుకొని 65 ఏళ్లు దాటిన వృద్ధులకు రేషన్ కార్డులను ఇళ్లకే పంపించాలని పలువురు కోరుతున్నారు. సర్కిల్–3లో ఇంకా 29,900 కార్డులను పంపిణీ చేయాల్సి ఉంది. వాటిలో అత్యధిక కార్డులు 65 ఏళ్లు దాటిన వృద్ధులకు సంబంధించినవే ఉంటాయని భావిస్తున్నారు.

కార్డుదారుల ప్రదక్షిణలు

స్మార్ట్‌కార్డుల కోసం ప్రజలు ముందంతా సచివాలయాల చుట్టూ తిరిగారు. ఇప్పుడు రేషన్ డిపోల చుట్టూ తిరుగుతున్నారు. పౌరసరఫరాల శాఖ సర్కిల్–3 పరిధిలో మొత్తం 1,30,905 స్మార్ట్ కార్డులు మంజూరయ్యాయి. వాటిని గత నెలాఖరు వరకు సచివాలయాల్లో పంపిణీ చేశారు. అక్కడ తీసుకోలేని కార్డుదారులకు ఈనెల ఒకటి నుంచి రేషన్ డిపోల్లో అందజేస్తున్నారు. అప్పటికీ తీసుకోలేని లబ్ధిదారులకు ఏఎస్‌వో సర్కిల్ కార్యాలయంలో అందజేస్తారని చెబుతున్నారు. వీటైనంతవరకు సచివాలయాల్లోనే కార్డులు తీసుకోవాలని అధికారులు ప్రకటించడంతో కార్డుదారులు సచివాలయాలు, రేషన్ డిపోల చుట్టూ తిరిగారు. ఇప్పటివరకు 1,01,000 కార్డుల పంపిణీ పూర్తయినట్టు అధికారులు చెబుతున్నారు. సచివాలయాల్లో కేవలం 30 శాతం కార్డులు పంపిణీ చేసినట్టు చెబుతున్నారు. మిగిలిన కార్డులను రేషన్ డిపోలవద్ద పంపిణీ చేయాలని చెప్పడంతో సమస్య మొదలైంది. ఒక పక్క రేషన్ ఇవ్వడంతోపాటు మరోపక్క కార్డులు పంపిణీ చేయడం తలకుమించిన పనిగా మారిందని డీలర్లు వాపోతున్నారు. వారికి సచివాలయ సిబ్బంది నుంచి సహకారం కూడా అందడం లేదని చెబుతున్నారు. దీంతో లబ్ధిదారులు తమ కార్డు తీసుకోవడం కోసం గంటల తరబడి క్యూలైన్‌లో నిలబడాల్సిన పరిస్థితి చోటుచేసుకుంది. ప్రతిరోజు ఇదే పరిస్థితి తలెత్తుతుండటంతో లబ్ధిదారులు తలలు పట్టుకొంటున్నారు.

అందరికీ అందజేస్తాం

ప్రతి లబ్ధిదారునికి కార్డు అందజేస్తాం. కార్డు రాలేదని ఏ ఒక్కరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. వృద్ధులకు ఇళ్లకు వెళ్లి కార్డులు ఇస్తాం. అయితే, కొంతమంది వృద్ధులు మాత్రం ఆతృతగా రేషన్ డిపోలవద్దకు వస్తున్నారు. ఎవరూ రావాల్సిన అవసరం లేదు. అందరికీ కార్డులు అందుతాయి.

– కృష్ణ, ఏఎస్‌వో, సర్కిల్–3

అసంక్రమిత వ్యాధులపై అవగాహన



మాట్లాడుతున్న డాక్టర్ ప్రదీప్ ప్రసాద్ రాజా

పెదగంట్యాడ: కౌమర దశలో కనిపించే అత్యంత సాధారణ ఎన్‌సీడీ (నాన్ –కమ్యూనికేబుల్)వ్యాధులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని దేవాడ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రదీప్ ప్రసాద్ రాజా అన్నారు. ఎన్‌సీడీపై పలు పాఠశాలల్లో బుధవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్త్రీల్లో వచ్చే రొమ్ము క్యాన్సర్, గర్భాశయ, ముఖద్వార క్యాన్సర్, నోటి క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. ముందస్తు పరీక్షలు చేయించడంతో వెంటనే గుర్తించి చికిత్సతో నివారించవచ్చని తెలిపారు.

అధికారుల దృష్టికి ప్రయాణికుల కష్టాలు

అగనంపూడి: పకీర్‌తక్యా నుంచి కాపు జగ్గరాజుపేట మీదుగా నగరానికి వెళ్లే మార్గంలోని అండర్‌పాస్ వంతెన వద్ద ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారని రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడు, కంచుమూర్తి ఈశ్వర్, దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కాటం చంద్రరావు, విజయ్‌కుమార్ అన్నారు. ఎన్టీపీసీ ట్రాక్ కిందన నిర్మించిన వంతెన మలుపుల్లో స్పీడ్ బ్రేకర్లు ఎత్తుగా వేయడం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయని తూర్పు కోస్తా రైల్వే ముఖ్య కార్యాలయానికి లేఖ రాయడంతో పాటు ట్విటర్ వేదికగా కోరినట్టు వారు బుధవారం తెలిపారు.

వేతనాలు చెల్లించేలా చూడండి



కేకే రాజుకు వినతిపత్రం సమర్పిస్తున్న సినర్జీస్ కాస్టింగ్ లిమిటెడ్ ఉద్యోగుల సంఘం నాయకులు

తాటిచెట్లపాలెం: దువ్వాడలోని సినర్జీస్ కాస్టింగ్ లిమిటెడ్ కంపెనీ ఉద్యోగులకు సకాలంలో వేతనాలు, పీఎఫ్, ఈఎస్‌ఐ వంటివి చెల్లించడం లేదని ఆ కంపెనీ ఉద్యోగుల సంఘం నాయకులు వాపోయారు. ఈ మేరకు వారు బుధవారం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజును కలిసి వినతి పత్రం సమర్పించారు. తమ సమస్యలను యాజమాన్యం దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదని ఉద్యోగ సంఘం నాయకులు తెలిపారు. సమస్యను పరిష్కరించే విధంగా మేనేజ్‌మెంట్‌తో మాట్లాడతానని, ఉద్యోగులకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని కేకే రాజు తెలిపారు. కార్యక్రమంలో సినర్జీస్ కాస్టింగ్స్ లిమిటెడ్ కంపెనీ ఉద్యోగుల సంఘం ప్రెసిడెంట్ ఎం శ్రీనివాస్, జనరల్ సెక్రటరీ దేవదాస్, ఉద్యోగులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు అంకురార్పణ



నవరాత్రి ఉత్సవాలకు రాట వేస్తున్న కోమటి శ్రీనివాసరావు దంపతులు



శరన్నవరాత్రుల పందిరి రాట వేస్తున్న కార్పొరేటర్లు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు

కూర్మన్నపాలెం: శరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. దుర్గాదేవి పూజల నిర్వహణకు పందిళ్లు వేసే పనిలో భక్తులు నిమఘ్నమయ్యారు. దీనిలో భాగంగా 87వ వార్డు కణితి గవర వీధిలో బుధవారం పందిరి రాట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు కోమటి శ్రీనివాసరావు దంపతులు హాజరై పందిరి రాటను శాస్త్రోక్తంగా వేసి ఉత్సవ ఏర్పాట్లను ప్రారంభించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ సనాతన ధర్మాన్ని చాటి చెప్పటానికి ఇటువంటి ఉత్సవాలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో నాయకులు బి.సన్యాసినాయుడు, వెంకటప్పారావు, సీతాలక్ష్మి, ధైర్యలక్ష్మి సతీష్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

దళ్లివానిపాలెంలో...

పెదగంట్యాడ: దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని కార్పొరేటర్లు తిప్పల వంశీరెడ్డి, పులి లక్ష్మీబాయి, గాజువాక బీజేపీ కన్వీనర్ కరణం రెడ్డి నరసింగరావు అన్నారు.74వ వార్డు దళ్లివానిపాలెంలో ఈ నెల 22 నుంచి వచ్చేనెల 2 వరకూ నిర్వహించనున్న దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు జాగరపు శ్రీను ఆధ్వర్యంలో బుధవారం పందిరి రాట వేశారు. కార్యక్రమంలో నాయకులు గంట్యాడ గురుమూర్తి, దళ్లి పైడికొండ, అప్పారావు, బాబురావు శ్రీనివాసరెడ్డి,వినోద్‌బాలు, గంధం సాయి తదితరులు పాల్గొన్నారు.

ఆ నీటిని అనకాపల్లి, నరవకు మళ్లించొద్దు



అగనంపూడి వాటర్ ప్లాంట్ నుంచి నీటిని మళ్లించొద్దని ఏఈని కోరుతున్న నాయకులు

అగనంపూడి: జీవీఎంసీ 79,85,88 వార్డుల్లోని అగనంపూడి, దువ్వాడ పరిసర గ్రామాల కోసం నిర్మించిన 85 ఎంఎల్‌డీ నీటి శుద్ధి కర్మాగారం నుంచి అనకాపల్లి, నరవ ప్రాంతాలకు నీటిని తరలించొద్దని అగనంపూడికి చెందిన నాయకులు జీవీఎంసీ నీటిసరఫరా విభాగం ఎస్ఈ పల్లంరాజుకు వినతిపత్రం అందజేశారు. అనకాపల్లి, నరవ ప్రాంతాలకు తరలించడం వల్ల తమ ప్రాంతాలకు సరిపడా నీరు అందడం లేదని వివరించారు. అలాగే సూదికొండ దిగువ ప్రాంతాలకు పైప్‌లైన్లు ఏర్పాటు చేసి నీటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. అలాగే అనకాపల్లి కొప్పాక వద్ద మురుగునీరు, కలుషిత నీరు ఏలేరు కాల్వలో కలుస్తుందని ఈ విషయంలో అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు ఇల్లపు ప్రసాద్, బలిరెడ్డి సత్యనారాయణ, రమేష్, అచ్చుత్ పాల్గొన్నారు.

ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలి



కరపత్రాలు అందిస్తున్న సీపీఎం నాయకులు

గాజువాక: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు నిరసనగా సీపీఎం నాయకులు షీలానగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈవోఐ పేరుతో సీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించడానికి కేంద్ర ప్రభుత్వం పూనుకుందని, దీనికి రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మద్దతు తెలుపుతోందని పేర్కొంటూ కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. ఈవోఐలను రద్దు చేయడంతో పాటు ప్రైవేటీకరణ నిర్ణయం ఉపసంహరించుకోవాలనే డిమాండ్‌తో ఈనెల 11న పాతగాజువాకలో నిర్వహించనున్న బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ నాయకుడు ఎస్.జగన్నాథరావు కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకోవడానికి ప్రతి ఒక్కరూ పోరాటంలో పాల్గొవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు జి.మణి, గాంధీ, మల్లిక, గీత, దేవుడమ్మ, శరత్‌చంద్ర, పార్వతి, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ఏయూలో ఇంటర్ యూనివర్సిటీ క్రికెట్ టోర్నీ

మద్దిలపాలెం: ఆంధ్రా యూనివర్సిటీ వేదికగా త్వరలో సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ పురుషుల క్రికెట్ టోర్నమెంట్ జరగనుందని ఏయూ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆచార్య ఎన్.విజయమోహన్ వెల్లడించారు. ఏయూ వ్యాయామ విద్యా విభాగంలో ఆయన అధ్యక్షతన బుధవారం ఏయూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్పోర్ట్స్ సైన్సెస్ 2025–26 సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయమోహన్ మాట్లాడుతూ ఈ నెల 15న ఆర్చరీ పురుషులు, మహిళల విభాగంలో యూనివర్సిటీ జట్టు ఎంపిక ఉంటుందన్నారు. ఈ నెల 25న యోగా పురుషులు, మహిళల జట్టు ఎంపిక జరుగుతుందని తెలిపారు. ఈ ఏడాది ఇంటర్ కాలేజీ క్రీడలు మహిళలు, పురుషుల విభాగంలో జరుగుతాయని చెప్పారు. కబడ్డీ, హాకీ, ఫుట్‌బాల్, క్రికెట్, హ్యాండ్‌బాల్, కోకో, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, కిక్ బాక్సింగ్ తదితర క్రీడల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. ఐదు జిల్లాలకు చెందిన ఏయూ అనుబంధ కళాశాలల క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. ఇంటర్ కాలేజ్ క్రీడల్లో ఎంపికైన క్రీడాకారులకు సౌత్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. ఏయూ వ్యాయామ విభాగాధిపతి ఆచార్య పల్లవి మాట్లాడుతూ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా వివిధ క్రీడా పోటీలను నిర్వహించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వాసుదేవరాజు, డాక్టర్ కిరణ్మయి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



నిరసన కార్యక్రమాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

అగనంపూడి: పెండింగ్ డీఏలు వెంటనే చెల్లించాలని, సీపీఎస్ రద్దు చేయాలని, పీఆర్సీ ప్రకటించాలని డిమాండ్ చేస్తూ గురువారం నుంచి ఈనెల 19వ తేదీ వరకు జరపతలపెట్టిన నిరసన కార్యక్రమాల పోస్టర్‌ను ఏపీటీఎఫ్‌నాయకులు ఆవిష్కరించారు. స్థానిక హైస్కూల్‌లో ఏపీటీఎఫ్ గాజువాక మండల కమిటీ నాయకులు, జిల్లా కౌన్సిలర్లు, ముఖ్య నాయకుల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో గాజువాక కమిటీ అధ్యక్షుడు డి.సత్యనారాయణ మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలు చెల్లించాలని, అలాగే కూటమి హామీ మేరకు సీపీఎస్ రద్దు చేయాలని, పీఆర్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల ఆరోగ్య పథకం పరిమితి పెంచాలన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయులను ఆర్థికంగా నష్టపరిచే కార్యక్రమం కూటమి ప్రభుత్వం చేపడుతుందన్నారు. వారం రోజుల పాటు నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నామన్నారు. అలాగే ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పి.అప్పారావు, ఆర్టీడీ నాయుడు, బి.త్రిలోక్, సత్యనారాయణ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆత్మహత్యలు నివారించదగినవే..



మాట్లాడుతున్న డాక్టర్ ఎన్.ఎస్.రాజు

సీతంపేట: ఇటీవల పెరుగుతున్న ఆత్మహత్యలు దిగ్భ్రాంతికి గురిచేస్తున్నాయని భారతీయ మానసిక వైద్య సంఘం పూర్వ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.ఎన్.రాజు అన్నారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినం సందర్భంగా బుధవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో కౌసల్య కౌన్సిలింగ్ సెంటర్ నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ప్రసంగించారు. లక్ష మందిలో 12 నుంచి 15 మంది ప్రతి ఏటా బలవన్మరణాలకు పాల్పడుతున్నారని, ఇవి చాలా వరకు నివారించ దగినవే అన్నారు. ప్రజల్లో అవగాహన పెరిగి సత్వర నివారణ చర్యలు చేపడితే చాలా మంది ప్రాణాలను కాపాడవచ్చన్నారు. పరీక్షల్లో ఫెయిల్ కావడం, ప్రేమలో వైఫల్యాలు, భార్యాభర్తల గొడవలు, వివాహేతర సంబంధాలు, ఆర్థిక లావాదేవీలు, మత్తు పదార్థాలు సేవించడం, మానసిక అనారోగ్యం ఆత్మహత్యలకు కారణమవుతున్నాయని వివరించారు. పిరికి మనస్కులు, కష్టనష్టాలు ఉన్నవారు మాత్రమే బలవన్మరణాలకు పాల్పడతారని, వాటిని నివారించే శక్తి వేరే వారికి లేదనేది పూర్తిగా అవాస్తమన్నారు. ఆత్మహత్య ప్రయత్నం చేసే వారు మానసిక దౌర్బల్యం ఉన్నవారనేది అపోహ మాత్రమేనని, శారీరక రోగాల మాదిరిగా మానసిక ఆందోళన, దిగులు వంటి పరిస్థితులను కౌన్సెలింగ్ మందుల ద్వారా నయం చేసుకోవచ్చని చెప్పారు. డాక్టర్ నిహాల్ మాట్లాడుతూ ఆత్మహత్యలను నివారించే దిశగా ప్రజలను అప్రమత్తం చేయడమే బాధ్యతగా ఇటువంటి అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

మ్యాన్‌హోల్‌పై మూత వేయరూ!



కణితి మెయిన్‌రోడ్డుపై మూతలేని మ్యాన్‌హోల్

కూర్మన్నపాలెం: గొయ్యిలు తవ్వారు.. వాటిని అలాగే వదిలేశారు. పట్టించుకునే నాథుడు లేకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే చాలామంది వాహన చోదకులు ఆ గొయ్యి వద్ద బోల్తాపడి తీవ్రంగా గాయపడ్డారని అక్కడి వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ విషయం

జీవీఎంసీ 87వ వార్డు కణితి ప్రధాన రహదారిపై వేసిన మ్యాన్‌హోల్‌ను నిర్లక్ష్యంగా విడిచి పెట్టేశారు. ఇప్పుడు అది వాహనచోదకులకు ప్రాణసంకటంగా మారింది. దగ్గరికి వచ్చే వరకూ కనపడక పోవడంతో వాహనాలు అదుపు చేయలేక అందులో పడిపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి మ్యాన్‌హోల్‌పై మూతవేయించి ప్రజల ప్రాణాలు కాపాడాలని పలువురు కోరుతున్నారు.

ఆటోలో.. రక్తపు మడుగులో..

- అడ్డూరు సమీపంలో ఢీకొన్న ఆర్టీసీ బస్సు
- ఆటో డ్రైవర్ మృతి.. ఆటోలోని నలుగురికి తీవ్ర గాయాలు
- ఒకరి పరిస్థితి విషమం
- సహాయం అందక గంటపాటు విలవిల
- క్షతగాత్రులంతా ఒకే కుటుంబానికి చెందినవారు
- పెద్దకర్మకు వెళ్లి తిరిగివస్తుండగా ప్రమాదం



ఆటో చిక్కుకొని తలకిందులుగా వేలాడుతున్న డ్రైవర్ మృతదేహం

చోడవరం: వెంకన్నపాలెం–సబ్బవరం రోడ్డులో అడ్డూరు సమీపంలో మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. తెనుగుపూడి నుంచి గాజువాక వెళుతున్న ఆటోను ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. బస్సు అతి వేగంగా వెళుతూ ఆటోను ఢీకొట్టడంతో ఆటో డ్రైవర్ కురచా భూషణం అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ప్రమాదంలో చిక్కుకున్న వారంతా ఒకే కుటుంబానికి చెందినవారు. వివరాల్లోకి వెళితే... చీడికాడ మండలం జైతవరం గ్రామానికి చెందిన కురచా భూషణం, కురచా నాయుడు, కురచా వరాహమూర్తి, మతల వరాహమూర్తి, కురచా శంకర్ జీవనోపాధి రీత్యా గత కొంతకాలంగా గాజువాకలో నివాసం ఉంటున్నారు. దేవరాపల్లి మండలం తెనుగుపూడి గ్రామంలో తమ బంధువుల ఇంట్లో జరిగిన పెద్దకర్మ కార్యక్రమానికి భూషణం ఆటోలో వీరంతా మంగళవారం ఉదయం బయలుదేరి వెళ్లారు. మధ్యాహ్నం తిరిగి వస్తుండగా వెంకన్నపాలెం–సబ్బవరం రోడ్డులో అడ్డూరుకు సమీపంలో ఎదురుగా వేగంగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో వీరు ప్రయాణిస్తున్న ఆటో నుజ్జునుజ్జయింది. ఆటో డ్రైవర్ భూషణం అక్కడికక్కడే మృతి చెందగా మిగతా నలుగురికి తీవ్ర గాయాలయ్యారు. వీరిలో కురచా శంకర్ పరిస్థితి విషమంగా ఉంది. క్షతగాత్రులను అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించగా అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం విశాఖపట్నం కేజీహెచ్‌కు తీసుకువెళ్లారు. మృతుడు భూషణానికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. క్షతగాత్రుల్లో కురచా నాయుడు విశాఖ డెయిరీలో వెటర్నరీ అసిస్టెంట్‌గా పనిచేస్తుండగా మిగతా వారు ఎస్ఆర్ఎంటీలో పనిచేస్తున్నారు. వీరి తల్లిదండ్రులు స్వగ్రామమైన జైతవరంలో ఉంటుండగా భార్యాపిల్లలతో కలిసి వీరంతా గాజువాకలో నివాసం ఉంటున్నారు. ప్రమాదవార్త తెలిసిన వెంటనే జైతవరం గ్రామంలో తీవ్ర విషాదం అలుముకుంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నట్టు సీఐ అప్పలరాజు చెప్పారు.

గంటపాటు రోడ్డుపైనే రక్తపు మడుగులో క్షతగాత్రులు

108 అంబులెన్స్ రాకపోవడంతో సుమారు గంటపాటు క్షతగాత్రులంతా రక్తపు మడుగులోనే ప్రాణాపాయంతో కొట్టుమిట్టాడారు. బస్సు ఢీకొనడంతో ఆటో ముందుభాగం పూర్తిగా ధ్వంసమై ఆటోలో కూర్చొని గాయాలపాలైన వారంతా బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. అటుగా వెళుతున్న వారంతా సహాయం చేసేందుకు ప్రయత్నించినప్పటికీ తీవ్ర రక్తస్రావంతో క్షతగాత్రులంతా ఉండటం వల్ల సాధ్యం కాలేదు. దీంతో తీవ్ర రోదనల మధ్య క్షతగాత్రులంతా రక్తపు మడుగులోనే గంటపాటు ఉండిపోయారు. వైద్యం ఆలస్యం కావడం వల్లే తలకు బలమైన గాయమై ఎక్కువ రక్తం పోయిన కురచా శంకర్ అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారని అక్కడి వారంతా ఆందోళన వ్యక్తం చేశారు.

సకాలంలో స్పందించిన చోడవరం పోలీసులు

ఫోన్ చేసి గంట అయినా 108 అంబులెన్స్ రాకపోవడంతో కొందరు చోడవరం పోలీసు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అప్పలరాజుకు ఫోన్ చేశారు. ఆయన వెంటనే స్పందించి హుటాహుటిన జీపులో ఎస్ఐతోపాటు సిబ్బందిని ప్రమాద స్థలానికి పంపారు. వారు రక్తపు మడుగులో కొట్టుమిట్టాడుతున్న క్షతగాత్రులను వెంటనే ఆస్పత్రికి తరలించారు.

వైభవంగా నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ బేడామండపంలో ఉదయం 9.30 నుంచి ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై వేంజేపచేశారు. జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు.